గుండెపోటుతో వీఆర్ఓ పుల్లారావు మృతి

పుల్లారావు (ఫైల్)

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం-2 సచివాలయ పరిధిలో వీఆర్ఓగా పని చేస్తున్న పుల్లారావు (48) కె.జగ్గవరంలో గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున పుల్లారావు అస్వస్థతకు గురికావడంతో వెంటనే చింతలపూడిలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పుల్లారావు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని తెలిపారు. ఆయన స్వగ్రామం కె.జగ్గవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. తహశీల్దార్ సుభాష్ తన సిబ్బందితో వెళ్లి పుల్లారావు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుల్లారావు వీఆర్ఓగా సుమారు 15 ఏళ్ల పాటు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేశారన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పొసగని పొత్తు..!

టిడిపి, జనసేన నేతల నడుమ వీడని విభేదాలు

పలు నియోజకవర్గాల్లో ఎవరి దారి వారిదే అన్నట్లు పరిస్థితి

తణుకు, నరసాపురం, పోలవరం, ఏలూరులో కొరవడిన సఖ్యత

అసంతృప్తులంతా ఎడమొహం, పెడమొహమే

ఆత్మీయ సమావేశాలతో కలుపుకునేందుకు అభ్యర్థుల యత్నం

నరసాపురం బిజెపి అభ్యర్థికి టిడిపి, జనసేన నాయకులు దూరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన నాయకుల మధ్య పొత్తు పొసగడం లేదు. టిక్కెట్ దక్కని నాయకులు, వారి అనుయాయులు తీవ్ర అసంతృప్తితో ఎడమొహం, పెడమొహం అన్నట్లు ఉంటున్నారు. దీంతో టిక్కెట్ దక్కించుకున్న అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే... సఖ్యతతో మసలుకుంటారా అనే అనుమానం ఇరుపార్టీల కేడర్‌లోనూ నెలకొంది. నరసాపురం నియోజకవర్గ టిక్కెట్ జనసేనకు దక్కిన సంగతి తెలిసిందే. జనసేన అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్‌కు అవకాశం లభించింది. దీంతో ఇక్కడ టిక్కెట్ ఆశించిన టిడిపి నాయకులు పొత్తూరి రామరాజు, కొవ్వలి రామ్మోహనాయుడు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చి దాదాపు 15 రోజులు గడిచిపోయింది. నాయకర్‌కు టిక్కెట్ ప్రకటించి పది రోజులైంది. ఇప్పటికీ జనసేన అభ్యర్థికి టిడిపి నాయకుల నుంచి తగిన మద్దతు లభించడం లేదని తెలుస్తోంది. దీంతో జనసేన నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. నరసాపురం నియోజకవర్గంలో టిడిపి నాయకులు జనసేన అభ్యర్థి నాయకర్‌కు సహకరిస్తారా, లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. అధినాయకులు జోక్యం చేసుకుంటేనే తప్ప సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు కన్పించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తణుకు సీటు టిడిపికి కేటాయించడంతో మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ రంగంలోకి దిగారు. జనసేన టిక్కెట్ ఆశించిన విడివాడ రామచంద్రరావు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటి వరకూ ఆరిమిల్లి, విడివాడ కలిసి నియోజకవర్గంలో ఒక్కరోజు కూడా తిరిగిన పరిస్థితి లేదు. ఇటీవల మాజీ మంత్రి పితాని సత్యనారాయణ నివాసం వద్ద జరిగిన సమావేశంలోనూ జనసేన నాయకుల నుంచి సహకారం లేదంటూ ఆరిమిల్లి చెప్పినట్లు తెలిసింది. గ్రామాల్లో జనసేన కేడర్ కొంత మద్దతుగా ఉన్నప్పటికీ ప్రధాన నాయకులు దూరంగా ఉండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలవరం టిక్కెట్ పొత్తులో జనసేనకు దక్కింది. దీంతో టిడిపి నుంచి టిక్కెట్ ఆశించిన బొరగం శ్రీనివాస్, ఆయన అనుయాయులు తీవ్ర అసంతృప్తితో రోడ్డెక్కారు. జనసేనకు తమ సహకారం ఉండదని బహిరంగంగానే టిడిపి నాయకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. రకరకాల ఊహాగానాల అనంతరం జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజుకు అవకాశం దక్కింది. పోలవరం నియోజకవర్గంలో టిడిపి నేతలు స్తబ్దతగా ఉన్నారు. పోలవరం నియోజకవర్గంలో టిడిపికి బలమైన ఓటుబ్యాంకు ఉంది. జనసేన అభ్యర్థి గెలవాలంటే టిడిపి నాయకత్వం పెద్దఎత్తున కృషి చేయాల్సిందే. అయితే అక్కడా పరిస్థితి మాత్రం కానరావడం లేదు. ఇరుపార్టీల నాయకుల మధ్య సయోధ్య కుదిరి ఎన్నికల్లో ముందుకు సాగుతారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఏలూరు ఎంఎల్ఎ టిక్కెట్ టిడిపికి కేటాయించడంతో బడేటి చంటి బరిలోకి దిగారు. జనసేన టిక్కెట్ ఆశించిన రెడ్డి అప్పలనాయుడు, ఆయన అనుయాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని రెడ్డి అప్పలనాయుడు మాట్లాడిన పరిస్థితి. పార్టీ పెద్దల జోక్యంతో రెడ్డి అప్పలనాయుడు శాంతించినట్లు కన్పిస్తున్నా, ఎన్నికల పోరులో చురుగ్గా లేరని స్పష్టంగా తెలుస్తోంది. ముందుముందు పొత్తు పొసగుతుందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి. ఆచంట, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, ఉండి వంటి చోట్ల టిడిపి, జనసేన నాయకులు కలిసి ప్రచారం నిర్వహిస్తున్నా కొన్ని నియోజకవర్గాల్లో అటువంటి పరిస్థితి లేకుండాపోవడం గెలుపోటములపై ప్రభావం చూపుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థికి టిడిపి, జనసేన దూరం

టిడిపి, జనసే, బిజెపి పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం బిజెపికి కేటాయించారు. ఆ టిక్కెట్ భూపతిరాజు శ్రీనివాసవర్మకు దక్కింది. అయితే బిజెపి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజుకు టిక్కెట్ దక్కుతుందని టిడిపి, జనసేన అభ్యర్థులు ఆశించారు. దీంతో వారు తా శ్రీనివాసవర్మ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా సమావేశం సైతం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. శ్రీనివాసవర్మ నుంచి ఎంఎల్ఎ అభ్యర్థులకు ఆర్థిక సాయం ఏమీ ఉండదని, దీంతో ఎన్నికల్లో తీవ్ర ప్రభావం పడుతుందని టిడిపి, జనసేన అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బిజెపి ఎంపీ అభ్యర్థికి, టిడిపి, జనసేన నాయకులకు మధ్య సయోధ్య లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికీ నరసాపురం టిక్కెట్ నాకే అంటూ రఘురామకృష్ణంరాజు చెబుతుండటంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

పేదలపై 144 సెక్షనా..!

దోసపాడులో పోలీసు బలగాల మోహరింపు

అసైన్‌మెంట్ సీలింగ్ భూములు ఇవ్వాలని కోరితే నిర్బంధకాండ

భూస్వాములకు వర్తించని144, 145 సెక్షన్లు

పోలీసుల తీరుపై వ్యవసాయకార్మిక సంఘం, సిపిఎం నేతల ఆగ్రహం

దోసపాడులో మోహరించిన పోలీసు బలగాలు

ప్రజాశక్తి - దెందులూరు రూరల్

దోసపాడు పేదలకు న్యాయం చేయాలని, అసైన్డ్, సీలింగ్ భూములపై సర్వే నిర్వహించి పేదలకు పంచాలని కోరితే 144, 145 సెక్షన్లు విధించి పోలీస్ బలగాలను మోహరించి అక్రమంగా హౌస్ అరెస్టులు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదలకు మాత్రమే 144 వంటి సెక్షన్లు వర్తిస్తాయా.. బడాబాబులకు వర్తించవా అనే ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నేతలు నిలదీస్తున్నారు. దోసపాడులో దళితులకు చెందిన వందల ఎకరాల భూమిని బడాబాబులు అన్యాయంగా దక్కించుకుని అనుభవిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. కొన్నాళ్లుగా తమ భూములు తమకే చెందేలా చర్యలు తీసుకోవాలని దోసపాడులోని దళితులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. పాదయాత్రలు, ఆందోళనలు, చెరువులకు గండికొట్టడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ ఇతర అధికారులను కలిసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. భూముల సమస్యపై జాయింట్ కలెక్టర్ కోర్టులో, లోకాయుక్త వంటివాటిలో కేసు వేసిన పరిస్థితి ఉంది. అయితే ఇప్పటికీ పేదలకు న్యాయం జరగని పరిస్థితి కొనసాగుతోంది. తాజాగా మరోసారి అక్కడి పేదలపై ఉక్కుపాదం మోపడం చర్చనీయాంశమైంది. వ్యవసాయ కార్మిక సంఘం, దోసపాడు భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం చేపల చెరువుల వద్దకు వెళ్తున్న దళితులు, పేదలు, వ్యవసాయ కార్మికులను పోలీసు బలగాలు దోసపాడు గ్రామంలో అడ్డుకున్నాయి. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణను ఏలూరు టూటౌన్ కానిస్టేబుల్లో హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం దెందులూరు ఎస్ఐ స్వామి 50 మంది కానిస్టేబుళ్లు, సిబ్బందితో దోసపాడు చేరుకుని పేదలను, దళితులను భయభ్రాంతులకు గురి చేశారు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా ఇళ్లలో ఉన్న మహిళలను మగ పోలీసుల ఫొటోలు, వీడియోలు తీయడం గమనార్హం. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తామని బెదిరించడం ప్రజాస్వామ్యమా లేక నియంతృత్వమా అంటూ బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణను గృహనిర్బంధం చేసిన పోలీసులు

న్యాయం చేయమని అడిగితే నిర్బంధమా

పివి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

భూములు తమకు అప్పగించి న్యాయం చేయమని అడిగితే దళితుల పట్ల రెవెన్యూ, పోలీస్ అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోరాటం ప్రారంభమయ్యాక ముఖ్యమంత్రి రెండుసార్లు దెందులూరు నియోజకవర్గంలో పర్యటించినా దళితులకు న్యాయం జరగలేదన్నారు. గ్రామంలో దళితులు, పేదలు రెండేళ్లుగా న్యాయం చేయాలని అధికారులను అడుగుతుంటే మండల రెవెన్యూ, పోలీసులు అధికారులు కుమ్మక్కై, చట్ట ధిక్కరణ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. దోసపాడులో పేదలు, దళితులు వారి హక్కుల కోసం, భూముల కోసం పోరాడుతుంటే శనివారం దెందులూరు ఎస్ఐ స్వామి పోలీస్ బలగాలను పంపి గ్రామంలో భయభ్రాంతులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు కోల్పోయి 25 ఏళ్లు గడచినా నేటికీ న్యాయం జరగక పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దోసపాడులో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూములు విజయవాడకు చెందిన దేవినేని బాజీ ప్రసాద్, ఆయన కుటుంబీకులు, బినామీలు అక్రమంగా, దౌర్జన్యంగా, చట్ట విరుద్ధంగా సాగు చేస్తుంటే రెవెన్యూ శాఖ అధికారులు మొద్దు నిద్రపోతున్నారన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు చట్టాలు అమలు చేయడం లేదన్నారు. చట్టాన్ని ధిక్కరించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దళితులు, పేదలపై నిర్బంధం దారుణం

ఏలూరుఅర్బన్: దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో పట్టాలు పొందిన అసైన్డ్ భూముల కోసం పోరాడుతున్న దళితులు, పేదలపై పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించి ఇళ్లవద్ద కాపలాకాస్తూ బెదిరిస్తూ వ్యవహరించిన తీరును సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆర్.లింగరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సమావేశం పోలీసుల చర్యలు నిరసించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ 1956 నుండి దఫదఫాలుగా స్థానిక దళితులు, పేదలకు ప్రభుత్వ అసైన్‌మెంట్, సీలింగ్ భూములకు పట్టాలిచ్చారన్నారు. విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్ మండలంలోని భూస్వాములు పేదల భూములు కాజేసి నిబంధనలకు విరుద్ధంగా చేపలు, రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని విమర్శించారు ఈ భూములు తమకు తిరిగి అప్పగించమని 15 ఏళ్లుగా స్థానిక పేదలు పోరాడుతున్నారని, లోకాయుక్త, జిల్లా, హైకోర్టులను సైతం ఆశ్రయించారని తెలిపారు. 300 ఎకరాల్లోని 70 ఎకరాలు ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉందని గుర్తు చేశారు. ఆ భూములపై 145 సెక్షన్ విధించారనిచ, చట్టప్రకారం భూస్వాములు కూడా అడుగుపెట్టకూడదని, అయినప్పటికీ వాళ్లు యథేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు. కోళ్ల వ్యర్థాలను ఎరువులుగా జల్లుతున్నా రెవెన్యూ అధికారులు భూస్వాముల కాసులకు కక్కుర్తి పడి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పేదలు వెళ్లినప్పుడు మాత్రం పోలీసులు అడ్డుపడుతున్నారన్నారు. చట్టం ముందు అందరూ సమానమనే ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణం పోలీస్ బలగాలను గ్రామం నుంచి ఉపసంహరించుకోవాలని, ఈ ఘటనకు కారకులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని పేద దళితులకు తమ అసైన్‌మెంట్ భూముల అప్పగించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దోసపాడు దళితులు, పేదలకు సిపిఎం అండగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు డిఎన్‌వి.ప్రసాద్, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పికి వినతి

దోసపాడులో పోలీసు బలగాలను ఉపసంహరించాలని, బెదిరింపులు ఆపాలని, సంబంధిత అధికారులపై తగుచర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ తరపున జిల్లా ఎస్‌పికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శివర్గ సభ్యులు ఉన్నారు.

న్యాయ విజ్ఞానం కోసమే వర్క్‌షాప్‌లు

హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్

మాట్లాడుతున్న జస్టిస్ బి.కృష్ణమోహన్

ప్రజాశక్తి - ఏలూరు

న్యాయ విజ్ఞానాన్ని పొందడానికి వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అధ్యక్షతన జిల్లాలోని న్యాయమూర్తులకు వివిధ అంశాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో హైకోర్టు జడ్జి, పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ న్యాయాధికారులకు చట్టంపై స్థూల, విధానపరమైన అవగాహన ఎప్పటికప్పుడు అవసరమని భావించే ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో రిసోర్స్‌పర్సన్స్‌గా సీనియర్ న్యాయవాదులు వైవి.రవిప్రసాద్, మజ్జి సూరిబాబు, ఎపి హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎన్.సాల్మన్‌రాజు పాల్గొని పార్టిషన్, మార్టిగేజ్, మనీ, డిక్లరేషన్, ఇంజెక్షన్ చట్టాలు ఎప్పటికప్పుడు మారుతున్న సవరణలపై వివరించారు. తొలుత రాష్ట్ర హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్ జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులు ఎ.విజయ్‌కుమార్, న్యాయవాదులు స్వాగతం పలికారు. తదనంతరం కక్షిదారుల సౌలభ్యం నిమిత్తం ఏర్పాటు చేసిన లిఫ్టును, సౌర విద్యుత్‌ను, కోర్టు హాలులో ఏర్పాటు చేసిన ఎయిర్ కండిషన్స్‌ను జస్టిస్ బి.కృష్ణమోహన్ ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజల దాహర్తి తీర్చేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం ఎంపిడిఒలు తదితరులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాగునీటి ఎద్దడి నివారణ, ఉపాధి హామీ తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా తాగునీటి ఇబ్బంది ఉందో అధికారులు ముందుగానే తెలుసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు యుద్ధప్రాతిపదికన అత్యవసర మరమ్మతులు చేసేందుకు మండల పరిషత్ నిధులు వినియోగించుకోవాలన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో వేడిగాలులు వీచే పరిస్థితులు ఉన్నందున తగు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఎటువంటి ప్రచారాలకూ తావులేని రీతిలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను మధ్యాహ్నంలోపే పూర్తి చేసుకునేలా ప్రణాళిక అమలు చేయాలన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో సేద తీరేందుకు కార్మికులకు నీడ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ టి.శ్రీపూజ, డిఆర్‌ఒ డి.పుష్పమణి, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ ఎ.రాము, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ పాల్గొన్నారు.

వేసవిలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

పాఠశాలలోని అవగాహనా కార్యక్రమంలో గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వేసవి కాలంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే వడదెబ్బ, ఇతర అంటు వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు వడదెబ్బ, దాని నివారణ మార్గాలు, ఇతర అంటు వ్యాధులపై, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎక్కువగా ఎండలో ఆడుకోవడం వల్ల, అధిక వేడి వల్ల మన శరీరంలో ఉండే నీరు చెమట రూపంలో బయటికి పోవడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. తీవ్రమైన వడదెబ్బ వల్ల శరీర ఉష్ణోగ్రత పెరగడం, తీవ్రమైన జ్వరం రావడం, డిహైడ్రేషన్‌కు గురవడం, వాంతులు అవడం, ఆయాసపడి నిరసించుకుపోవడం, స్పృహ తప్పిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బ నుంచి రక్షించుకోవాలంటే 12 గంటల్లోపు పనులు ముగించుకోవడం, మరలా నాలుగు గంటల తర్వాత పనులు చేయడం, ఎక్కువగా ద్రవపదార్థాలైన కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఒఆర్ఎస్ ద్రావణం, మంచినీరు తీసుకోవడం, లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం వంటివి చేయాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు తలకు తలపాగా టోపీ, లేదా గొడుగు వాడాలని సూచించారు. ఎక్కువగా వడదెబ్బకు వయసులో పెద్దవారు, విద్యార్థులు, గర్భిణులు, చిన్నపిల్లలు గురయ్యే అవకాశం ఉంది కాబట్టి వారు ప్రత్యేకమైన జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. అలాగే వేసవికాలంలో సాధారణ జ్వరాలు కూడా వచ్చే అవకాశం ఉందని, మనకి ఎక్కువగా హాని చేసే మలేరియా, డెంగీ దోమలు మంచి నీటి నిల్వ ప్రాంతాలలో పెరుగుతాయి కాబట్టి వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే ఆచరించాలన్నారు. విద్యార్థులు ఎక్కువగా నులిపురుగు వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని, భోజనానికి ముందు హ్యాండ్‌వాష్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత, హెల్త్ సూపర్వైజర్ గొరిపర్తి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్త బిబి జయినాబ్, ఆశా కార్యకర్తలు సునీత, రత్నకుమారి ఉపాధ్యాయులు ప్రసన్న కృష్ణమోహన్, సుబ్బారావు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులకు శిక్షణ

ఏలూరు టౌన్: దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 23 మంది సెక్టార్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శనివారం దెందులూరు తహశీల్దార్ వారి కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివిఎం ప్యాట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. వాటిని ఉపయోగించి ఎన్నికల నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి జాతీయస్థాయి గుర్తింపు

విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడులోని ట్రిపుల్ ఐటి కళాశాలకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు దక్కిందని వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ తమ కళాశాలలోని మూడో సంవత్సరం విద్యార్థులు పావని, జస్వంత్ రూపొందించిన సీతాకోక చిలుక సంభోగ రోబోటిక్ ప్లాట్‌ఫామ్ ప్రాజెక్ట్ ప్రజెంటేషన్‌ను హైదరాబాద్ అటానమస్ నావిగేషన్ ఇన్నోవేషన్ హబ్ ఆమోదించినట్లు తెలిపారు. దీంతో ట్రిపుల్ ఐటికి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఘనత సాధించిన విద్యార్థులను ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందించారు.

మూగ జీవాలకు తాగునీటి వసతి కల్పించండి

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - ఏలూరు

తాగునీటి కోసం మూగజీవాలు గ్రామాల్లో అల్లాడుతున్నాయని, వాటికి తాగునీటి వసతి కల్పించి ఆదుకోవాలని డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో డిపిఒ పలు సూచనలు చేశారు. వేసవి తాకిడి ఎక్కువగా ఉండడం, భూగర్భ జలాలు తగ్గడం, గ్రామాల్లో చెరువులు నిండుకుండటం వల్ల సమస్య జఠిలంగా మారిందని, గ్రామాల్లో మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి తొట్టెలను పునరుద్ధరించి వాటికి తాగునీటి వసతి కల్పించాలని అన్నారు. చెత్త, ఎండుటాకులు, మురికితో ఉన్న తొట్టెలను శుభ్రపర్చి నీటితో నింపాలని, ఇది వేసవి ప్రణాళికలో భాగమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని డిఎల్‌పిఒలు, విస్తరణ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఓట్లు లేకున్నా ఫీట్లు..!

బిజెపి తీరుపై జనం విస్మయం

'ఓట్లు చూస్తే తక్కువ.. ఫీట్లు చూస్తే ఎక్కువ' అన్నట్లుంది ఉమ్మడి జిల్లాలో బిజెపి పరిస్థితి. ఓట్లే కాదు కేడర్ కూడా పరిమితంగానే ఉన్నా పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం నుంచి రెండు, మూడుసార్లు, తాడేపల్లిగూడెం, కైకలూరు అసెంబ్లీ స్థానాల నుంచి ఒక్కోసారి బిజెపి గెలిచింది. సింగిల్‌గా పోటీ చేస్తే కనీసం పది శాతం ఓట్లు కూడా రాని పరిస్థితి ఆ పార్టీది. అయితే తాజాగా ఏలూరు, నరసాపురం సీట్ల కోసం ఆ పార్టీ నేతలు చేసిన ఫీట్లు, ఆపై నరసాపురం ఎంపీ అభ్యర్థిని ఖరారు చేశాక ఇప్పటికీ ఆ పార్టీలో చేరని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు తానే కూటమి ఎంపీ అభ్యర్థినని ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కేంద్రంలో అధికారంలో ఉండి, క్రమశిక్షణ కలిగిన పార్టీగా చెప్పుకునే ఆ పార్టీ జిల్లా నేతలే ప్రస్తుత పరిణామాలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం నుంచి బిజెపి పోటీ చేస్తుందని అంతా భావించినట్లే ఆ పార్టీకే సీటు ఖరారైంది. అయితే నరసాపురంలో బలమైన అభ్యర్థి లేరంటూ ఏలూరు సీటు పొత్తులో కోరాలని బిజెపి గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపనా చౌదరి) అధినేతలపై ఒత్తిడి తెచ్చారు. దీనికి ముందు నుంచే ప్రణాళికగా బూత్ నేతల సమావేశం సైతం ఏలూరులో నిర్వహించి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సైతం ఆహ్వానించారు. అయినప్పటికీ ఏలూరు సీటు బిజెపికి ఇచ్చే అవకాశం లేదని తెలియడంతో తపనా చౌదరి ఆత్మీయ సమావేశం పేరిట హడావుడి చేసి ఏలూరు ఎంపీ సీటు నుంచి బిజెపియే పోటీ చేయాలని నేతలచే తిరుగుబావుటా ఎగురవేయించారు. ఈలోపు నరసాపురం ఎంపీ సీటే బిజెపికి కేటాయించడంతో సిట్టింగ్ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజే అభ్యర్థి అవుతారని అంతా ఊహించారు. తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభలో

రఘురామకృష్ణంరాజు తాను కూటమి తరఫున బరిలో ఉంటానని ప్రకటించడంతో ఆ దిశగానే పెద్దఎత్తున ప్రచారం సాగింది. అయితే అనూహ్యంగా బిజెపి జాబితాలో రఘురామకృష్ణంరాజు పేరు లేకపోగా నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి, భీమవరం వాసి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేరు ఖరారైంది. దీంతో రఘురామకృష్ణంరాజు కంగుతిన్నారు. ఈ క్రమంలో ఆ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో టిడిపి, జనసేన ఎంఎల్‌ఎ అభ్యర్థులు మాజీ మంత్రి పితాని ఇంట సమావేశమై శ్రీనివాసవర్మ ఎంపీ అభ్యర్థి అయితే తమకు ఇబ్బంది అని, రఘురామకృష్ణంరాజు అభ్యర్థి అయితేనే బాగుంటుందని ఘంటాపథంగా చెప్పడంతోపాటు టిడిపి అధినేత చంద్రబాబు దృష్టికి పితాని తీసుకెళ్లేలా చేశారు. ఈ క్రమంలో భీమవరం చేరుకున్న ఎంపీ రఘురామకృష్ణంరాజు కూటమి సీటు తనదేనని, ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే అటు టిడిపి, జనసేన ఎంఎల్‌ఎ అభ్యర్థుల తీరు, ఇటు రఘురామకృష్ణంరాజు ప్రకటనలపై బిజెపి శ్రేణులు తీవ్ర అసంతృప్తి, నిర్వేదం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. తమ పార్టీ అభ్యర్థి ఎవరనేది ఎంత మిత్రపక్షమైనా ఇతర పార్టీలు ఎలా నిర్ణయిస్తాయని, అభ్యర్థిని ఎంపిక చేసేంత స్థాయి గల నేతలు తమ పార్టీలో లేరా అని ఆవేదన వ్యక్తం చేస్తుండటం బిజెపిలో నెలకొన్న గందరగోళానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. శ్రీనివాసవర్మే తమ అభ్యర్థి అని బిజెపి స్థానిక నేతలు చెబుతున్నా రఘురామకృష్ణంరాజు టిక్కెట్ ఎక్కడ ఎగరేసుకుపోతారోననే ఆందోళన వారికీ లోలోన ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. సీటు దక్కినా నరసాపురం నియోజకవర్గంలో బిజెపి శ్రేణులు అభ్యర్థి విషయంలో తీవ్ర గందరగోళంలో కొట్టుమిట్టాడుతుందే, సీటు దక్కక ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో శ్రేణులు నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. మొత్తానికి ఓట్లు లేకున్నా బిజెపి నేతల ఫీట్లు చూసి ఆ పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

సి-విజిల్‌పై ప్రజలకు అవగాహన అవసరం

ఏలూరు ఆర్‌డిఒ ఎం.ముక్కంటి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా అక్రమ మద్యం, నగదు, ఇతర బహుమతులను పంపిణీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఫిర్యాదులను సి-విజిల్ యాప్ ద్వారా సాధారణ ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌డిఒ ఎం.ముక్కంటి తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సి-విజిల్ అవగాహన బ్యానర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు చేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. సి-విజిల్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం ద్వారా ఎన్నికల్లో నగదు, మద్యం, బహుమతులు, అక్రమ రవాణాను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వి.మురార్జీ పాల్గొన్నారు.

'సి-విజిల్, సువిధ'లను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎన్నికల నియమావళిని అతిక్రమించే వారిపై సి విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని, రాజకీయ నాయకుల ప్రచార అనుమతుల కోసం సువిధలో దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డిఒ వై.భవానీ శంకరి తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడులో శనివారం ఆమె మాట్లాడుతూ సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రచారం, వాహన వినియోగాలకు సంబంధించి సువిధ ద్వారా రాజకీయ నాయకులు అనుమతులు పొందాలని అన్నారు.

చినవెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలను శనివారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 17 రోజులకు గాను రూ.1,52,94,247 ఆదాయం వచ్చింది. అలానే భక్తుల కానుకల రూపేన 320 గ్రాముల బంగారం, 3 కేజీల 392 గ్రాముల వెండి, పాత రూ.500(7నోట్లు), రూ.1000(3 నోట్లు), రూ.2 వేలు(14 నోట్లు) పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ వేండ్ర త్రినాధరావు తెలిపారు.

ప్రజాశీర్వాద యాత్ర వాయిదా

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజా ఆశీర్వాద యాత్రను ఈస్టర్ పండుగ సందర్భంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం వైసిపి దూలం నాగేశ్వరావు నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద యాత్రను ఈనెల 31 ఆదివారం నుంచి మండవల్లి మండలంలో నిర్వహించేందుకు రంగం సిద్ధం చేయడం జరిగిందన్నారు. అయితే క్రైస్తవ సహోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఈస్టర్ పండుగ ఆదివారం కావడంతో వారు ఆనందంగా గడుపుకోవాలనే ఉద్దేశంతో ప్రజా ఆశీర్వాద యాత్రను వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ఈస్టర్ పండుగ అనంతరం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే స్థానిక ఎంఎల్‌ఎ ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరిని కలుసుకొని ఆశీర్వాదాలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

బైపాస్ వద్ద వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలంలోని తుక్కులూరు గ్రామంలోని బైపాస్‌లో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. నూజివీడు-హనుమాన్ జంక్షన్ ప్రధాన రహదారి బైపాస్‌లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం రూరల్ ఎఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50 వేల లోపు నగదు తీసుకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందన్నారు. నియమావళి పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

నూజివీడు ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఆంధ్ర రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తారని నూజివీడు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో శనివారం ఆయన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. చేతివృత్తుల, వివిధ కార్పొరేషన్ లోన్ల ద్వారా ప్రతి ఒక్కరికి సహాయం చేస్తామని, హామీలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదట చింతలపూడి ఫేస్-2 పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మొక్కపాటి వెంకట మోహనరావు, గ్రామ సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, ఎంటిసి సూర్య దేవర నాగ మంజుల శ్రీనివాస రావు, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు గుడపాటి అజయ్ కుమార్, మాజీ సర్పంచి బొమ్మకంటి శ్యామలరావు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

బుట్టాయగూడెం: రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు తమ ఓటుహక్కుని నిర్భయంగా వినియోగించుకోవడానికి పోలీసు బలగాలు పనిచేస్తున్నాయని ఎస్ఐ వెంకన్న అన్నారు. బుట్టాయగూడెంలో పోలవరం డిఎస్‌పి సురేష్ కుమార్ రెడ్డి, జీలుగుమిల్లి సిఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ఎస్ఐ కె.వెంకన్న సిబ్బందితో కేంద్ర బాలగాలతో రహదారుల గుండా పోలీసు కవాతు నిర్వహించారు.

'సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం'

ముదినేపల్లి: పేదల పాలిట వరంలాంటి సంక్షేమ పథకాలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడం సిఎం జగనన్నకే సాధ్యపడుతుందని ఎంఎల్‌ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం మండలంలోని బొమ్మినంపాడు, రామచంద్రపురం గ్రామాల్లో వైసిపి ఎంఎల్‌ఎ, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

నదిలో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రమాదవశాత్తు నదిలో మునిగి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని సి.గుడిపాడు గ్రామానికి చెందిన బిలుగుది పుల్లారావు(21) రాజమండ్రి దగ్గర ఏగేశ్వరపురం వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. ప్రభువు దీక్ష స్వీకరించి 40 రోజులు గడిసిన అనంతరం పుణ్యక్షేత్రానికి వెళ్లి దీక్ష విరమణ చేస్తూ ఉంటారు. పుల్లారావు శుక్రవారంతో

దీక్ష ముగియడంతో రాజమండ్రి సమీపంలోని ఏగేశ్వరపురం ప్రభు పుణ్యక్షేత్రానికి వెళ్లి శనివారం ఉదయం దీక్ష విరమణ అనంతరం, పక్కన గల గోదావరి నదిలో స్నానానికి దిగగా నదిలో సుడిగుండంలో చిక్కుకొని మృతి చెందాడు. మునిగిపోయిన యువకుడిని పోలీసు సిబ్బంది గజ ఈతగాళ్లతో గాలించి, మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చి, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులైన బిలుగూది పోతయ్య, సుక్కమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బాలుడిపై కుక్క దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలంలోని మీర్జాపురం గ్రామంలో 13 ఏళ్ల బాలుడుపై కుక్క దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కె.వినయ ప్రసాద్ తనయుడు ఇంటి పక్క బంధువుల కుక్కకు అన్నం పెట్టాడు. అన్నం పెట్టి వెనుక తిరిగి వచ్చేలోపు కుక్క తనపై దాడి చేసిందని బాధితుడు వాపోయాడు. కాలికి సుమారు పది గాయాల వరకు ఉన్నాయని, కుటుంబ సభ్యులు బాధితున్ని నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి దాడికి గురవుతున్నామని, పంచాయతీ వారు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, కె.శాంతరాజు

ప్రజాశక్తి - మండవల్లి

ఓటుహక్కును వినియోగించి ప్రజలకు సేవ చేసే, భావితరాల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే నాయకులను ఎన్నుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శాంతరాజు కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై స్థానిక సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఓటు వేసి పాలకులను మనమే ఎంచుకునే గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఒక్క ఓటు కూడా వృధా కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అభ్యర్థులు పదవులు పొందెందుకు ఆరాటపడుతున్నారని, గెలుపు కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, అధికారం పొందిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రూ.వందల కోట్లు కూడ పెడుతున్నారని విమర్శించారు. నగదు పంపిణీ చేసిన వారికి ఓటు వెయ్యవద్దంటూ ఓటు కొనడం, అమ్మడం రెండూ నేరమని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించగల చిత్తశుద్ధి కలిగిన వారిని గుర్తించి ఓటు వేయాలన్నారు. పోటీ చేసిన అభ్యర్థుల్లో ప్రజాసేవ చేసేవారు లేరని భావిస్తే నోటా గుర్తుకు ఓటు వేయాలని, అది కూడా ఓటు హక్కు వినియోగించుకున్నట్లేనని వారు పేర్కొన్నారు. అనంతరం ఓటును అమ్ముకోవద్దు, భావితరాల భవిష్యత్తును నాశనం చేయవద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గోరింక గాంధీ, కొండపల్లి రవి వరప్రసాద్, బేతపూడి తంబి, దాకారపు వినోద్ కాశి, బుద్ధుల రాముడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రచారంలో ఎంఎల్ఎ అప్పారావు

పేదల అభ్యున్నతికి జగన్ కృషి

ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సంక్షేమ ప్రదాత జగన్ ప్రజల హృదయాల్లో ఉంటాడని, బడుగు బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి జగన్ అని ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు కొనియాడారు. జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆయన కోరారు. నూజివీడు పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలని, బాపు నగర్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టంను పటిష్టంగా అమలు చేయాలని ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం ఏలూరు డివిజన్ స్థాయి గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలు కమిటీ సమావేశంలో ఆర్‌డిఒ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టంను అమలు చేయని స్కానింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. చట్టాన్ని మరింత పటిష్టవంతంగా అమలు చేసేందుకు డివిజన్‌లోని ప్రతీ స్కానింగ్ సెంటర్లపై కమిటీ సభ్యులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నిబంధనలు పాటించకుండా చట్టాన్ని అతిక్రమించిన స్కానింగ్ కేంద్రాలను సీజ్ చేసి, సంబంధిత స్కానింగ్ కేంద్రాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆసుపత్రులలో అబార్షన్లు చేసిన ప్రతీ కేసుపై సవివరమైన నివేదిక తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.నాగేశ్వరరావు, డిప్యూటీ డెమో నాగరత్నం, కమిటీ మెంబర్లు రంగారావు పాల్గొన్నారు.

సిఐటియు, ప్రజాసంఘాల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక ప్రధాన సెంటర్‌లోని భద్రిరాజు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిఐటియు, ప్రజాసంఘాల మండల కార్యాలయాన్ని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రారంభించారు. ఇది రాజకీయ కార్యాలయం కాదని, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కరించుకునేందుకు చర్చా వేదిక అన్నారు. కార్మిక, కర్షక, ప్రజా సంఘాల కొరకు మాత్రమే కార్యాలయం రూపుదిద్దుకోవడం అభినందనీయమన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, మండల కార్యదర్శి జక్కుల మహేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.రమణారావు, వ్యవసాయ కార్మిక సంఘం

కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎ.రవి

మండల కార్యదర్శి శేషపు మహంకాళీరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరవల్లి భాస్కరరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి ముంగం సురేష్, అంగన్వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడు రమాదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు దాసరి విజయ, మహిళా సంఘం నాయకులు దండుబోయిన నాగమణి, ఎస్.మహాలక్ష్మి, వి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ధర్మారాజు, మహేష్ యాదవ్‌లను గెలిపించాలి

టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - భీమడోలు

రానున్న ఎన్నికల్లో టిడిపి తరఫున ఏలూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పుట్టా మహేష్ యాదవ్‌తో పాటు, ఉంగుటూరు అసెంబ్లీ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మరాజును గెలిపించాలని ఏలూరు టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, ఇతర నాయకులు, కార్యకర్తలతో చేపట్టిన మహా పాదయాత్ర శనివారంతో ముగిసింది. మూడు రోజుల క్రితం నియోజకవర్గ శివారు ప్రాంతమైన మెయ్యేరు గ్రామం నుంచి బయలుదేరిన పాదయాత్ర శనివారం ఉదయం కైకరం నుంచి పున్న ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో అభ్యర్థి ధర్మరాజుతో పాటు టిడిపి నాయకులు, భీమడోలు సొసైటీ మాజీ అధ్యక్షులు గన్ని నాగ గోపాలరావు పాల్గొని కార్యక్రమానికి నేతృత్వం వహించారు. మహ పాదయాత్ర మండలంలోని పూళ్ళ, కురెళ్ళగూడెం, అంబరుపేట గ్రామపంచాయతీల మీదుగా భీమడోలు చేరుకుంది. ఆ తరువాత యాత్ర భీమడోలు జంక్షన్ మీదుగా

మహాపాదయాత్ర ముగింపులో గన్ని, ధర్మరాజు

నియోజకవర్గ శివారు పొలసానిపల్లి చేరుకొన్న తరువాత ముగిసింది. దాదాపు 80 కిలోమీటర్లు కొనసాగిన యాత్రలో భాగంగా జనసేన అభ్యర్థి ప్రజలను కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్గమధ్యలో కొన్ని ప్రాంతాల్లో దేవాలయాలు, ప్రార్థనాలయాల్లో టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని జనసేన కార్యకర్తలు, నాయకులతో పాటు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలి

భీమడోలు బస్టాండ్‌లో ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు బస్టాండ్‌లోని మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలని, దీనికోసం పాడైపోయిన బోరుకు రిపేరు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. జిల్లాలో ముఖ్యమైన బస్టాండ్‌లలో భీమడోలు ఒక్కటి. దూర ప్రాంతాల నుంచి, జిల్లా పరిసర ప్రాంతాల నుంచి ద్వారకాతిరుమల దేవస్థానానికి పెద్ద ఎత్తున యాత్రికులు వస్తుంటారు. వీరు ద్వారకాతిరుమల వెళ్లేందుకు భీమడోలు బస్టాండ్‌కు తప్పనిసరిగా రావాల్సిన ఆవశ్యకత ఉంది. ఇదే కాకుండా హైదరాబాద్, విజయవాడ నుంచి రాజమండ్రి, ఆపై ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సాధారణంగా తెల్లవారుజాము ప్రాంతంలో భీమడోలు చేరుకుంటారు. విజయవాడ-రాజమండ్రి మధ్య ప్రయాణం చేసే బస్సు ప్రయాణికులు ఇతర ప్రాంతాలలో మరుగుదొడ్లు లేనందువల్ల, భీమడోలు బస్టాండ్ వద్ద గల మరుగుదొడ్ల సౌకర్యాన్ని వినియోగించుకుంటారు. ఈ బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలను తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు చెందిన ఆర్‌టిసి వారు చేపడతారు. బస్టాండ్ నిర్వహణను ద్వారకాతిరుమల

బస్టాండ్‌లోని మరుగుదొడ్లకు వాటర్ లేదని బోర్డు..

దేవస్థానం దత్తత తీసుకొని నిర్వహిస్తున్నారు. గత మూడు రోజుల కాలంగా బస్టాండ్‌లోని బోరు పాడైంది. దీంతో నిర్వాహకులు మరుగుదొడ్ల నిర్వహణకు నీటి సౌకర్యం లేని కారణంగా మరుగుదొడ్లకు తాళాలు వేశారు. వాటర్ లేదు అని బోర్డు పెట్టారు. ఈ విషయం తెలియని పలువురు దూర ప్రాంత ప్రయాణికులు తమ మరుగుదొడ్ల అవసరాలు తీర్చుకునేందుకు భీమడోలు బస్టాండ్‌కు వచ్చి, అక్కడ సౌకర్యాలు లేని కారణంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ సమస్య గురించి యాజమాన్యానికి తెలియజేసినట్లు తెలిపారు. దీనిపై భీమడోలు బస్టాండ్‌కు చెందిన బాధ్యులను వివరణ కోరగా బోరు పాడైన కారణంగా మరుగుదొడ్లకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకు వెళ్లామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలి

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - ఏలూరు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా బూత్ లెవెల్ ఆఫీసర్స్, క్షేత్రస్తాయి సిబ్బంది సహకరించాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం(ఎసి 65) రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి అధ్యక్షతన బూత్ లెవెల్ అధికారులు, క్షేత్రస్తాయి సిబ్బందితో జరిగిన బూత్ లెవెల్ అసోసియేషన్ గ్రూపు(బ్యాగ్) కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలమైన ప్రజాస్వామ్యం కోసం అర్హులైన పౌరులందరూ ఓటు హక్కు వినియోగించుకునే దిశగా జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉన్న ఓటర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఓటుహక్కు వినియోగంపై అవగాహనా కల్పించడంతో పాటు, ఎథికల్ ఓటింగుపై ప్రచారం చేస్తున్నామన్నారు. జిల్లాలో 16,25,655 మంది ఓటర్లు ఉంటే ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 23,23,02 ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో అనేక కారణాల వల్ల 147 మంది హోమ్ ఓటింగు వినియోగించవచ్చని ఒక అంచనాకి వచ్చినట్టు చెప్పారు. 2019 ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గంలో 68.54 శాతం పోలింగ్ నమోదైందని, ఈసారి 85 శాతం లక్ష్యం పెట్టుకొని, ఓటరు అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని డిపిఒ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అర్హులైన ఓటర్లందరూ తమ ఓటుహక్కు వినియోగించుకునేలా వివిధ రూపాల్లో అవగాహన పరచడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగా క్షేత్రస్తాయి సిబ్బంది తన పరిధిలో ఉన్న ఓటర్లందరూ పోలింగులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వాల నుంచి వివిధ సేవలు హక్కుగా ఎలా కోరుకుంటామో అదే మాదిరిగా ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తెరగాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ పాటించాలని, దీనిలో భాగంగా ఓటును నగదుకు, బహుమతులకు అమ్ముకోవడం నేరమని ప్రతిఒక్కరూ ఏథికల్ ఓటింగ్ జరిగే విధంగా సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం బూత్ లెవెల్ అసోసియేషన్ గ్రూపు సభ్యులతో ఓటుహక్కు వినియోగంపై డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ తహశీల్దార్ ఎం.ముఖర్జీ, అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ కార్మికుల జీతాలు చెల్లించాలని ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా రెవెన్యూ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీసత్య సాయి మంచినీటి పథకం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 4 నియోజకవర్గాలలో 180 గ్రామాలకు గోదావరి జలాలను మంచినీటిగా అందిస్తున్న పథకం అన్నారు. ఈ పథకంలో 130 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో ఎక్కువమంది విద్యావంతులు ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి చెందిన వీరు ప్రస్తుతం 4 నెలలుగా జీతాలు లేక దుర్భల దారిద్ర్య పరిస్థితులు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం నిధులు మంజూరు చేసి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి ఎన్.బాలాజీ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ వినయ్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

23-24 ఫైనాన్షియల్ ఇయర్ ఈనెల 31తో పూర్తి కావస్తుందని, పట్టణ ప్రజలు చెల్లించాల్సిన పన్నులు చెల్లించాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ వినయ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజలు ఇప్పుడు ప్రభుత్వం వారు ఇస్తున్న వడ్డీ రాయితీని సద్వినియోగపరచుకుని ఇంటి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు పూర్తిగా చెల్లించి, వడ్డీ మాఫీ పొందవలసిందిగా కోరుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు పట్టణంలో 68 శాతం వరకు వసూలు చేయడం జరిగిందని, మిగిలిన 38 శాతం పూర్తిచేసి 100 శాతం వసూలు అవ్వడానికి పట్టణ ప్రజలు సహకరించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈనెల 31వ తేదీ లోపు అన్ని పన్నులు చెల్లించి, వడ్డీ రాయితీని పొందాలన్నారు. ఈనెల 31 ఆదివారం మున్సిపల్ కార్యాలయానికి సెలవు లేదని, మున్సిపల్ కార్యాలయ కౌంటర్స్ అన్ని ఓపెన్‌గా ఉంటాయని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సహకరించాలని తెలిపారు.

'ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తా'

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి అధికారంలోకి రాగానే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసే బాధ్యత నాదని టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో గత వారం రోజుల క్రితం అంగడాల భవాని పాముకాటుతో మరణించగా, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని కోరారు. వీరితోపాటు నూజివీడు నియోజకవర్గం ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి, జనసేన నాయకులు బర్మా ఫణి బాబు, రాపర్ల ప్రతాప్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో ముద్దరబోయిన

'ఏ సమస్యైనా పరిష్కరిస్తా..'

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా ముద్దరబోయిన ఉన్నాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలని మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన ఆత్మీయులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశాలకు వస్తున్నటువంటి ప్రజలను చూసి ఇరు పార్టీలలోనూ ఆందోళన నెలకొందన్నారు. తనకు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తానని నమ్మకం ఉందని అందుకు కారణం తన పక్కన నాయకులు లేకపోవడమే అన్నారు. నాయకులు ఉన్న రెండుసార్లు తాను ఓటమి చెందానని, ఇప్పుడు కార్యకర్తలే తనకు అండగా ఉన్నారన్నారు. నాయకులు ఇప్పుడు కొలుసు ప్రార్థసారథి వెనక్కి చేరారని, ఆయనకు ఈసారి మూడు నామాలు పెటడం గ్యారంటీ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A. No. 365/2023 in O.S. No. 329/2023

Between:

పిటీషనర్/వాది:

పిసిని నాగబాబు, S/o. రామారావు, R/o. శృంగవృక్షం, పాలకోడేరు మండలం.

రెస్పాండెంట్/ ప్రతివాది:

ఇందుకూరి శ్రీనివాస నాగరాజు, S/o. రామకృష్ణంరాజు, R/o. డో.నెం. 3-63, రాజులపేట, జానకీ రామరాజపురం, H/o. చినకాపవరం, ఆకివీడు మండలం, సెల్: 77320 96546.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు అయిన పిసిని నాగబాబు, రెస్పాండెంటు అయిన ఇందుకూరి శ్రీనివాస నాగరాజు అను మీకు కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున, పై పిటీషను విషయంలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల **ది. 11-04-2024వ సం॥ తేదీన ఉదయం గం॥ 10.00 ని॥లకు** స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసింది. లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 11-04-2024

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పాకా రమేష్‌బాబు
కట్టా మాలతీలత
భీమవరం అడ్వకేట్స్, భీమవరం
30-3-2024 సెల్: 9701842726

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 329/2023

Between:

వాది:

పిసిని నాగబాబు, S/o. రామారావు, R/o. శృంగవృక్షం, పాలకోడేరు మండలం.

ప్రతివాది:

ఇందుకూరి శ్రీనివాస నాగరాజు, S/o. రామకృష్ణంరాజు, R/o. డో.నెం. 3-63, రాజులపేట, జానకీ రామరాజపురం, H/o. చినకాపవరం, ఆకివీడు మండలం, సెల్: 77320 96546.

పై నెంబరు దావాలో వాది అయిన పిసిని నాగబాబు, ప్రతివాది అయిన ఇందుకూరి శ్రీనివాస నాగరాజు అను మీకు కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున, పై దావా విషయంలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల **ది. 11-04-2024వ సం॥ తేదీన ఉదయం గం॥ 10.00 ని॥లకు** స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసింది. లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 11-04-2024

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పాకా రమేష్‌బాబు
కట్టా మాలతీలత
భీమవరం అడ్వకేట్స్, భీమవరం
30-3-2024 సెల్: 9701842726

వేలము ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 38/2023 in O.S. No. 26/2009

బిట్వీన్:

పట్నాల మల్లికార్జునరావు @ మల్లేశ్వరరావు ...D.H.R

మరియు

శ్రీమతి వీర్ల వెంకట మాణిక్యాంబ ...J.D.R.

పై నెంబరు గ్రంథములో డి.హెచ్.ఆర్. గారు వారికి రావలసిన బాకీ వసూలు కొరకు జె.డి.ఆర్ పై దావా వేసి డిక్రీ పొంది సదరు డిక్రీ బాకీ తీర్మానము కొరకు జె.డి.ఆర్. హక్కు భుక్తములు కల్గిన యీ దిగువ షెడ్యూల్ స్థిరాస్తిని **ది. 15-04-2024వ తేదీ ఉదయం 10 గం॥ 30 ని॥ల** లగాయతు పై కోర్టు వారు బహిరంగ వేలము జరిపించెదరు. గాన పాడుకొనలదచినవారు పై తెల్పిన తేదీన శ్రీ కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Tadepalligudem Sub-Registry, Pentapadu Mandal, Prathipadu Panchayat, with an extent of Ac. 1-43 cents of dry-land, covered by R.S. No. 173/2, 3 which is bounded by:

EAST: Land belongs to Veerla Ramachandra Rao. **SOUTH:** Land belongs to Veerla Satyavathi. **WEST:** Land belongs to Veerla Ramachandra Rao and Sri Goutham Budda Minorities Education Society, Tanuku. **NORTH:** Land belongs to Sri outham Budda Minorities Education Society, Tanuku and the belongs to Naraharasetty Usha Rani.

Within the above boundaries an extent of Ac. 1-43 cents of dry-land is situated therein.

DHR Value: Rs. 20,00,000/-

Amina Value: Rs. 64,00,000/-

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మద్దా శ్రీనుబాబు
DHR తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
ది. 30-3-2024 సెల్: 9963739591